# ముడిసరుకు

కల కాదని స్పష్టంగా చెప్పగలను. నిజంగా జరిగిందని మిమ్మల్ని నమ్మించటానికి ప్రయత్నించాను. ఎందుకంటే, మీరు నమ్మరు. అబద్ధాలు నిజంగా రాస్తే నమ్మేవాళ్లు లేరని కాదు - వేల సంఖ్యలో ఉన్నారు.

కాని అబద్ధాలు నిజంలాగా రాసే శక్తి అనేకమందికి ఉన్నట్టు, నాకులేదు. అందుచేత నేను చెప్పబోయేది నిజమూ కాదు పూర్తిగా అబద్ధమూ కాదు. ఇది ఒకానొక మనస్థితిలో కలిగిన అనుమానాస్పదమైన అనుభవం.

"ఏమిటో రాస్తున్నారు? కథ కాదు కదా?"

తల ఎత్తి చూశాను. చాలా హుందాగా, పాశ్చాత్య నాగరికత ఉట్టిపడేట్టున్నాడు అపరిచితుడు.

"కథ కాదు నిజం. ఉత్తరం రాసుకుంటున్నాను. మీరెవరు?" అని అడిగాను.

అడిగిన దానికి సమాధానం చెప్పకుండా, "కథలు రాయటం మానేశావుట?" అని అడిగాడు.

"చాలా పాత వార్త."

"నీకు పాత్రలు దొరకటం లేదటగా? స్పష్టంగా చెప్పక ఏదో సాహిత్య సిద్ధాంతాలు చెబుతున్నావుట! నన్ను పాత్రగా పెట్టి కథ రాసుకో!" అన్నాడతను. హరిశ్చంద్రుడు, విశ్వామిత్రుడికి చతురంబోధిపరీత భూతలయమెల్లన్ నీకు దానంగా ఇచ్చేస్తున్నాను. తీసుకో అన్న స్పిరిట్‌లో.

"తమర్ని నేను ఎరుగనే!"

"నాన్సెన్స్ నువ్వు పాశ్చాత్య సాహిత్యానికి దూరమై ఒక తెలుగు కథ అయినా రాయలేని దుస్థితికి వచ్చావు. కనీసం తెలుగు కథకులు పాశ్చాత్య హృదయంతో రాసిన కథలన్నా చదివి, ఇన్‌స్పెక్టర్ కాలేదు. నీకిది గొప్ప అవకాశం."

"లాభం లేదు. నాలో తెలుగు హృదయమే జబ్బు జబ్బుగా ఉన్నది. పాశ్చాత్య హృదయమంటే-"

గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్లిపోయాడు. నేను విచారించలేదు. నాకు అణిగి మణిగి

ఉండే పాత్రలంటే ఎంత రోతో, నామీద దాష్టీకం చేసే పాత్రలన్నా అంత అసహ్యమే. కథలు రాసేవాడికీ, పాత్రలకూ మధ్య ఎంతో ఆత్మీయత ఉండాలి.

"వేగిరం! వేగిరం! నా కవతల ఏవేవో బోలెడన్ని పనులున్నాయి. ఇటుకేసి వచ్చానుగదా అని చుట్టపు చూపుగా చూసి పోదామనీ–"

గొంతూ, యాసా పరిచితంగా ఉన్నది.

"మీరు గుర్తురావటంలేదు. ఈ మధ్య బుర్ర సరిగా పనిచెయ్యటంలేదు అందుచేత–"

"దారుణం! ఎంత చెడ్డా మీకు కొంత ఖ్యాతి తెచ్చిన వాణ్ని నన్ను అలాగే వదిలేశారేవిటి చెప్మా. వాకబు చేసిపోదామని–"

గుర్తువచ్చాడు. మంచి బ్రాహ్మడు! నేను ఉపయోగించిన పాత్రలన్నింటిలోకి పౌరాణిక మనస్తత్వంగల పెద్దమనిషి. కాని నన్ను బెదరగొట్టాడు. ఆయనను తలుచుకుంటేనే వణుకు పుట్టసాగింది. అంత భయం కలిగించే వాడితో అప్యాయత ఏమిటి? కాని ఆ మాట ఆ పెద్ద మనిషితో ఎలా చెప్పను.

"రండి, రండి పరధ్యానంగా ఉండి చప్పున పోల్చలేక పోయాను. సీతప్పగారూ? నేను మీకు చాలా రుణపడి ఉన్నమాట నిజమే గాని, అస్త్రసన్యాసం చేసేశాను. కథలు రాయటంలేదు" అన్నాను క్షమాపణ పూర్వకంగా.

క్షమాపణకు ఆ మహానుభావుడు అగ్గుడేను. ఏమంటే, నేను దాదాపు అయిదు వందల కథలు దాకా రాసినా, మనసులో శాశ్వతంగా మెదిలే పాత్ర ఒక్కటి కూడా రాయలేదని నా మేలు కోరిన అభిమానులే చెప్పారు. అలాటి పరిస్థితిలో ఈ సీతప్ప గారు కొందరి మనుస్సుల్లోనయినా మెదలగలిగారు. ఆయన నాకు కొంత కీర్తి తెచ్చిన మాటలో అతిశయోక్తి లేదు. అలాటి పరిస్థితిలో ఆయనను చూసి నేను భయపడడమూ, మళ్లీ మళ్లీ ఉపయోగించలేక పోవటమూ నా దురదృష్టం. కాంతాన్ని, బారిష్టరు పార్వతీశాన్నీ, నాకన్నా గొప్ప రచయితల జుట్టు నెరసి, పళ్లూడిన దాకా ఉపయోగించుకున్నారు. కన్యాశుల్కంలో కల్లా హెచ్చు అయోమయం కలిగించే గిరీశం పాత్రను ఎంతమంది ఉపయోగించుకున్నారో లెక్కలేదు. ఈ సీతప్పగారు నాకు పనికిరాక, ఇంకొకరికి పనికిరాక, నాలుగు కాలాలపాటు నిలిచే పాత్ర కాలేకపోవటం చూస్తే దానికి వచ్చిన కాస్తపాటి పేరూ ఉత్తుత్తదేమో అని అనుమానం కలగకపోదూ. ఏమైనా ఇదంతా ఆయనతో అనటం మర్యాద కాదు.

"మీరు తొందరగా ఉన్నట్టున్నారు. నేను ఏ కారణం చేతనన్నా కథలు రాయదలిస్తే మీకు తప్పక కబురు చేస్తాను" అన్నాను.

సీతప్పగారు ముసిముసి నవ్వులు నవ్వుతూ, "ఆ మాటన్నారు, చాలు. వస్తా" అంటూ వెళ్లిపోయారు.

నేను రాసే ఉత్తరం ఎక్కడిదాకా వచ్చిందీ చూసుకుంటూండగా ఒక పెద్ద తుగిడీ వచ్చి పడింది. అంతా కుర్రకారు – ఆడవాళ్లూ, మగవాళ్లూ కూడా సినిమా హాల్స్ దగ్గరా, హైక్లాస్ హోటల్స్ దగ్గరా, సినిమా ప్రొడ్యూసర్లు ఇళ్లలోకి వొస్తూ, పోతూనూ కనిపించే సజ్జు. అందాకా దేనికి, ప్రతి కుర్రవాడూ ఓ సినిమా హీరోలాగున్నాడు. ప్రతి కుర్రదీ ఒక రేప్‌సీన్ హీరోయిన్ లాగా ఉంది.

వీళ్లంతా ఎవరు? ఎందుకొచ్చారు? ఆ మాటే అడిగాను.

"గురూగారూ, మమ్మల్ని పెట్టి నావెల్స్ రాసెయ్యండి. సినిమా కథలకు కటకటగా ఉన్నది. మీలాటి మరీ పాత రచయితలకు గిరాకీ రాబోతున్నట్టు విని, మీకు ఉపయోగపడతామేమోనని వచ్చాం" అన్నాడొక చుట్టల కంపెనీ అడ్వర్‌టైజ్‌మెంటులో లాటి "సింహం".

"థ్యాంక్స్ థ్యాంక్స్. మీరు పొరపాటు విన్నారు. నాచేత ఎవరూ సినిమాకు రాయించుకోరు. నేను ఎప్పుడన్నా సినిమాలను గురించి రాస్తే అది సినిమా వాళ్లకు ఎంతమాత్రమూ నచ్చదు. అయినా నన్ను జ్ఞాపకం పెట్టుకున్నందుకు కృతజ్ఞుణ్ని."

అంతా ఎలా వచ్చారో అలాగే వెళ్లిపోయారు. వెళ్లిపోయే ప్రతి అబ్బాయీ, అమ్మాయీ ఎవరివేపో అసహ్యంగా చూసి, ఎడం తప్పుకు పోతున్నట్టు నాకు అనిపించింది. అవును ఆ వచ్చిన బృందానికి చాలా విరుద్ధమైన మనిషి ఒకడు నిలబడి వెళ్లిపోయే వారికేసి వింతగా చూస్తున్నాడు.

"ఎవరు మీరు? ఏం కావాలి?" అన్నాను.

ఆ మనిషి నాకేసి తిరిగి, "విప్లవకారుణ్ని! నన్ను గురించి ఓ కథ రాయి" అన్నాడు, కొద్దిగా ముందుకు వస్తూ.

నాలో ఏదో ఆశ పుట్టింది. ఎన్నడూ విప్లవ రచన చేయలేదు. మంచి ఛాన్సు.

"రా. బాబూ, వచ్చి కూర్చుని నీ గురించి చెప్పు. కథ రాయగలనేమో చూస్తాను" అన్నాను.

"నా గురించి నే చెప్పుకోగలిగితే నువు దేనికీ?" అంటూ ఆ మనిషి, పిలుస్తున్నా వినిపించుకోకుండా వెళ్లిపోయాడు.

***ముద్రణ : ప్రభవ, ఏప్రిల్ 1979***